క్లుప్తంగా

నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు: అక్రమంగా నిల్వచేసిన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఆదివారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని జామతండా శివారు నిమ్మతండాకు చెందిన గుగులోతు నరేష్ అక్రమంగా నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. ఏఎస్సై యాకయ్య పోలీసు సిబ్బందితో కలిసి మీత్యతండా శివారు పంతులు తండాలో నరేష్‌కు చెందిన వ్యవసాయ భూమి దగ్గర వెళ్లి సోదాలు చేయగా అక్రమంగా 10బస్తాలు, 5క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక ఉన్నట్లు తెలిపారు. బెల్లం, పటికను స్వాధీనం చేసుకుని నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీవీ ప్యాట్ వినియోగంపై అవగాహన



గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వీవీ ప్యాట్ యంత్రం ద్వారా ఓటు ఎలా వేయాలో అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఓటరు నమోదు, ఈవీఎం పాడ్ గురించి అవగాహణ కల్పిస్తూ వాహనం ద్వారా ప్రచారం చేశారు.

గణపతి విగ్రహ విక్రయాల సందడి



డోర్నకల్: స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ విక్రయ కేంద్రాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది. వినాయక చవితి వేడుకలకు మరో పదిహేను రోజుల సమయం ఉన్నా డోర్నకల్‌తోపాటు వివిధ గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు బ్యాంక్ స్ట్రీట్‌లోని విక్రయ కేంద్రాల వద్ద తమకు నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేస్తుండడంతో బ్యాంక్ స్ట్రీట్‌లో సందడి నెలకొంది.

దంతాలపల్లి: గణపతి ఉత్సవాలకు వినాయక విగ్రహాలను ఇప్పటి నుంచే షాపు యజమానులు ముస్తాబు చేసి పలు గ్రామాలకు తరలిస్తున్నారు. ఇప్పటి నుంచే ఖమ్మం, మహబూబాబాద్, మరిపెడ పట్టణాలకు చెందిన వారు కొనుగోలు చేస్తున్నారని విగ్రహాల తయారిదారుడు ప్రకాశ్ తెలిపాడు. ఆదివారం ఒక్క రోజే సుమారు 300 విగ్రహాలను పలు గ్రామాలకు తరలించినట్లు పేర్కొన్నాడు.

హైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు



కేసముద్రం: హైదరాబాద్‌లో జరిగే పద్మశాలీ శంఖారావం సభకు ఆదివారం మండల కేంద్రం నుంచి పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సామల నర్సయ్య ఆధ్వర్యంలో పలువురు కులస్తులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు చలమల్లకిరణ్, సామల రమేష్, పెద్దనర్సయ్య, సాంబయ్య, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, శ్రీరంగం, గుండు శ్రీశ్రీను, బత్తుల వీరన్న, కొమురయ్య, శ్రీధర్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటరు నమోదు



గార్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఆదివారం కొత్త ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ కె.స్వాతిబిందు తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ పరిశీలించారు. ఆదివారం ఫాం-6 లో 35 మంది, ఫాం-7లో ఏడుగురు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభిలాష్, బీఎల్ఓ రుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

పెద్దవంగర: 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ మహేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితాలో తప్పొప్పులు ఉంటే సరి చేయించుకోవాలని సూచించారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లి ఎమ్మెల్యే నివాసంలో మరిపెడ మండలం గిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 2వ వార్డు మెంబర్ సయ్యద్ జెరీనా, గ్రా పార్టీ అధ్యక్షుడు యాక్షాలీతోపాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పది కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పని చేసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు ఆయూబ్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు మచ్చా వెంకట నర్సయ్య, గిరిపురం గ్రామపార్టీ అధ్యక్షులు పట్ల మల్లయ్య, ఉపాధ్యక్షులు బాలాజీ, ఉప సర్పంచ్ భాషిపంగు సుమలత, మండల బీసీ నాయకులు కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, వెంకన్న, సత్యం, సమ్మయ్య, మహేష్, సాంబశివరావు, కరీమ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లక్ష్మీనర్సింహస్వామి సేవా సమితి సభ్యులు

శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి సేవా సమితి బాధ్యులు, జిల్లా ముదిరాజ్ నాయకులు ఆదివారం వేర్వేరుగా ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నరసింహస్వామి గుట్టపైకి రోడ్డు మంజూరైన సందర్భంగా నర్సింహస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో, మహబూబాబాద్ జిల్లా మత్స్యశాఖ సంఘం చీఫ్ ప్రమోటర్‌గా కొత్తూరు రమేష్ ఎన్నికైనందున ముదిరాజ్ మహాసభ నాయకులు మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో సేవా సమితి అధ్యక్షులు గౌతమ్ రెడ్డి, బండి రమేష్, సభ్యులు శేషు, ప్రభాకర్, రాజు, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బొల్లం రమేష్, వివిధ గ్రామాల భక్తులు, మత్స్యశాఖ సంఘం చీఫ్ ప్రమోటర్స్ పిట్టల ధనుంజయ్, పంజ వెంకన్న, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు సహదేవ్, ముదిరాజ్ జిల్లా నాయకులు బీసు మల్లేశం, ఎడెల్లి యాకయ్య, రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కురవి: మండలంలోని సూదనపల్లి, రాజోలుతోపాటు శివారు పోలంపల్లి తండాలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదివారం పరామర్శించాడు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, బజ్జూరి పిచ్చిరెడ్డి, సపావట్ బిచ్చు, శంకర్, రాజోలు సర్పంచ్ షేక్ మస్తాన్, ఈడిగపల్లి వీరేందర్, అంబటి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజగొల్ల సత్యనారాయణ, బట్టు రవి, గుంటుక యాదగిరి, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

నేటినుంచి 'పల్లెపల్లెకు బీజేపీ'



మహబూబాబాద్ అర్బన్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్‌నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్రను నేటి నుంచి జరుగుతుందని యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పల్లెపల్లెకు బీజేపీ యాత్ర వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వద యాత్ర ఇనుగుర్తి మండలం నుంచి ఉదయం 8గంటలకు లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి గడపగడపకు పాద యాత్రను ప్రారంభిస్తామన్నారు. ప్రతి పల్లెలో గ్రామ పెద్దలను, మహిళలను, యువకులను, వ్యవసాయ క్షేత్రలల్లో పని చేస్తున్న మహిళలను కలిసి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాడానికి ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఈ యాత్రను దశల వారీగా చేస్తామని, కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి శ్యామ్ సుందర్ శర్మ, జెడ్పీటీసీ భూక్య సంగీత, ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, అసెంబ్లీ కౌన్సిల్ సభ్యులు శశివర్ధన్‌రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలు ఓర్సు పద్మ, పార్లమెంట్ కన్వీనర్ సతీష్, మైనార్టీ జాతీయ కమిషన్ సభ్యులు విమల్‌జైన్, పట్టణ కార్యదర్శి పల్లె సందీప్, నాయకులు డోలి సబిత, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం నుంచి చేపట్టనున్న పల్లెపల్లెకు బీజేపీ, ఇంటింటికీ హుస్సేన్‌నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పోలేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఇనుగుర్తి మండల అధ్యక్షుడు పంజాల దేవరాజ్, ప్రధాన కార్యదరిశ పోలేపల్లి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, నాగరాజు, ముకుందరెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో పేదలపై భారం



మాట్లాడుతున్న సమ్మెట రాజమౌళి

నెహ్రూసెంటర్: సామాన్య ప్రజలకు భారంగా మారిన అధిక ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. సీపీఎం కేంద్ర, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో పెరిగిన ధరలపై నిరసన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనలో నిత్యావసర ధరలు, పెట్రోల్, డిజిల్, ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం మోపుతున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర అధికారంలోకి వచ్చాక రూ.1200 చేరిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తూ ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రానున్న రోజుల్లో పెరిగిన ధరలపై దశలవారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు జంగ కళావతి, కుండకంటి అనిత, ఎస్‌కె రెహనా, అనూష పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

నర్సింహులపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిర్ర సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పడమటిగూడెంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలకు కాకుండా అందించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యతతో సైనికుల్లా పని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల ఉప్పలయ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, కనకాచారి, ఉపేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బీసీలకు 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

బయ్యారం: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో సమానంగా తరతరాలుగా జీవిస్తున్న బీసీలకు గృహలక్ష్మి పథకంను వర్తింపజేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కొత్త వినయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముత్యాలమ్మకు బోనాల సమర్పణ



అమన్‌గల్ గ్రామంలో బోనాలతో వెళ్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అమనగల్ గ్రామంలో నూతనంగా ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామస్తులంతా కుటుంబ సమేతంగా తరలివెళ్లి ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు. డీజే చప్పుళ్లు, బ్యాండ్ వాయిద్యాలతో భక్తి పాటల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. ముత్యాలమ్మతల్లి దేవాలయ ప్రారంభం సందర్భంగా గ్రామంలో వైభవంగా వేడుకలు జరిపి పాడిపంటలు మంచిగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించే విధంగా అమ్మవారు అనుగ్రహించాలని వేడుకున్నారు. విశ్వబ్రాహ్మణ పురోహితులు వంకోజు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో సహఅర్చకులు ప్రతిష్ఠాపన వేడుకలు జరిపారు.

బీసీ సింహగర్జనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వేణు

మరిపెడ: ఈనెల 10న హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీ సింహగర్జనను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగాని వేణు పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఈమేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు సరైన విధంగా సీట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సమాధి చేస్తామన్నారు. 60శాతం ఉన్న బీసీలకు 23 సీట్లు ఇచ్చి, 5 శాతం ఉన్న రెడ్లకు 40 సీట్లు, అరశాతం ఉన్న వెలమలకు 11 సీట్లు కేటాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాంపెల్లి అబ్బయ్య, డాక్టర్ రాజు, ఉప్పల రమేష్, భరత్, సాయి, లింగమూర్తి, కుమార్, వీరబాబు, అశోక్, విష్ణు, రాంచంద్రయ్య, రమేష్, ప్రవీణ్, వెంకటేష్, దిలీప్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



ఆహ్వాన పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

పెద్దవంగర: ప్రతీ ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని సర్పంచ్ కేతిరెడ్డి దీపికరెడ్డి, తొర్రూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి సోమనర్సింహరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో సీతామాచంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని కోరుతూ సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను పంపిణీ చేశారు. వేడుకను చూసేందుకు పంజలంతా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పసులేటి వెంట్రామయ్య, ఉప సర్పంచ్ ఐలయ్య, మాజీ సర్పంచ్ సాయిలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జయరాజు

కేసముద్రం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు జల్లే జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కేసముద్రం విలేజీలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో, బహిరంగ సభలో మంత్రి మల్లారెడ్డి భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్స్ ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదన్నారు. ఈనెల 5న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మేకల వెంకన్న, ఆంజనేయులు, సుదర్శన్, ప్రభాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమాజ మార్పు చిత్రాలతో సాధ్యం



చిత్ర బృందంతో ఉషా దయాకర్‌రావు

తొర్రూరు: సమాజ మార్పు సినిమాలతో సాధ్యమని ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు అన్నారు. స్థానికుడు పాలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శారద మూవీ మేకర్స్ 10రోజులుగా తెరకెక్కిస్తున్న ఓ చిత్ర షూటింగ్ ఆదివారం డివిజన్ కేంద్రంలో కొనసాగింది. ఈషూటింగ్‌ను ఉషా దయాకర్‌రావు సందర్శించి చిత్ర యూనిట్‌ను అభినందించారు. చిత్ర దర్శకుడు నాగ్ అద్దంకి పర్యవేక్షణలో హీరో రాజ్యం, హీరోయిన్ కాజల్ కిరణ్, ఇతర నటీనటులపై సన్నివేశాలు చిత్రీకరించారు. మానవ సంబంధాలు పెంపొందించే చిత్రాలు మరెన్నో రావాలని ఉషా దయాకర్‌రావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఏఎంసీ చైర్‌పర్సన్ శాంత, చిత్ర బృందం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన జేసీబీ



దంతాలపల్లి: మండలంలో జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో బీరిసెట్టిగూడెం గ్రామంలో నర్సింహులపేట మండలం పడిమటిగూడెం గ్రామానికి చెందిన జేసీబీ పనులు ముగించుకొని పడిమటిగూడెం వెళ్తున్న క్రమంలో, అదుపుతప్పిన జేసీబీ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టింది. దీంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. గమనించిన విద్యుత్ హెల్పర్ సురేష్ ఎలాంటి ప్రమాదం జరుగకుండా అధికారులకు తెలియజేశాడు. లైన్‌మెన్ వేమన ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జేసీబీ డ్రైవర్ బర్మవత్ అనిల్‌పై ఫిర్యాదు చేశాడు. మద్యం తాగి నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తాం

తొర్రూరు: పాలకుర్తిలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని నియోజకవర్గ నాయకులు బోగ భాస్కర్, ల్యాబ్ వెంకన్న అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీడీపీని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, నియోజకవర్గానికి బాధ్యున్ని కేటాయిస్తే పార్టీ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని మండలాలకు అధ్యక్షులను నియమించేందుకు జిల్లా నాయకులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, బైన బిక్షపతి, గణపురం ఎల్లయ్య, గుగులోతు రమేష్, బాషబోయిన యాకయ్యలు పాల్గొన్నారు.

శిబిరాలకు స్పందన

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు ఓటు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలకు స్పందన లభించింది. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవడం, ఓటరు బదిలీ, చనిపోయినవారు, గ్రామాల నుంచి వెళ్లిపోయిన వారి ఓట్లు తొలగించడం కోసం ప్రత్యేక తేదీలలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన శిబిరాలకు ప్రజల నుంచి స్పందన లభించింది. తహసీల్దార్ నాగభవాని పలు గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు.

నేలవాలిన మొక్కజొన్న



గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేల వాలింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంగంపేట, కేశవపట్నం గ్రామాల్లో మొక్కజొన్న పంట పాడైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జీపీ కార్యాలయాల్లో ఓటర్ లిస్టు

మరిపెడ రూరల్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా శాఖల అధికారులు ఓటర్ లిస్టు సరిచేయడంలో నిమగ్నమయ్యారు. ఈమేరకు తయారు చేసిన ఓటర్ లిస్టులను ఆయా గ్రామాల్లోని జీపీ కార్యాలయంలో గోడకు అంటించారు. గ్రామంలోని ఓటర్లు తమ పేరు ఉందో లేదో చూసుకోవాలని గ్రామంలోని బీఎల్వోలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సదరు ఓటర్ లిస్టులో పేరు లేకున్న ఏదైన తప్పుగా నమోదు అయిన వెంటనే బీఎల్వోల వద్ద అందుకు సంబంధించిన ఫాంలో వివరాలు నింపి ఇస్తే సరిచేయడం జరుగుతుందని గిరిపురం బీఎల్వో పట్ల రాధ తెలిపారు.

విస్తృత ప్రచారం..

మరిపెడ రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ నుంచి ఏదో పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటు కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ కొంత కాలంగా ఇక్కడ తిష్టవేసి అనుచర ఘనంతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే తన అనుచరులతో నియోజకవర్గం వ్యాప్తంగా గోడలకు పోస్టర్లను అతికిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

చేపపిల్లల విక్రయం



డోర్నకల్: స్థానిక చేపల మార్కెట్‌లో చేపల పెంపకం కోసం వ్యాపారులు చేపపిల్లలను విక్రయిస్తున్నారు. రాజమండ్రి నుంచి పిల్ల లను డోర్నకల్‌కు రవాణా చేసి విక్రయిస్తున్నారు. రవ్వ, బొచ్చ రకానికి చెందిన నాణ్యమైన పిల్లలను విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఖానాపురం : జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్సై మాధవ్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పెండింగ్ కేసులు ఉన్న వారికి ఆదివారం అవగాహన కల్పించారు. ఈనెల 9వ తేదీ వరకు పెండింగ్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. రాజీపడే కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

హడలెత్తిస్తున్న వానర సైన్యం



రోడ్డుపై సంచరిస్తున్న వానరాల గుంపు

గార్ల: పట్టణంలో వానర సైన్యం ప్రజలను హడలెత్తిస్తున్నాయి. తలుపులు తెరిచి ఆదిమరిస్తే చాలు, కోతులు ఇళ్లలో చొరబడి వండిన వంటకాలు ఎత్తుకెళ్లి తింటూ, నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. నిత్యావసర సరుకులు బజారుకు వెళ్లి తెస్తుంటే, మనుషుల మీదికి ఎగబడి తింటున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గార్లలో కోతులు దాడిచేసి ఆస్పత్రికి ప్రతీ రోజు ఒకరిద్దరు వైద్యం కోసం వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి గార్లలో కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓట్లు, సీట్లు కాదు.. సమస్యలపై చర్చించాలి

నర్సంపేట రూరల్ : ఓట్లు, సీట్లు కాదు.. ప్రజల పాట్లు, సమస్యలు చర్చించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన 'మీతో మీ రేవూరి' ముఖాముఖి సదస్సులో రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పార్టీలను పక్కనపెట్టి వ్యక్తిగా వ్యక్తిత్వంతో ఆలోచించాలన్నారు. సంక్షేమ పథకాల హామీలతో ప్రజలను మోసం చేసి బీఆర్ఎస్, నర్సంపేటను అభివృద్ధి చేశానన్న ధీమాతోనే ముందుకు వస్తున్నానన్నారు. 2014 తర్వాత తన క్యాడర్ అంతా చెట్టు, పుట్టకొకరుగా చెదిరిపోయారని, వారంతా ఏకమై పోగు కావాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. ధన ప్రభావం ఎక్కువైన ఈరోజుల్లో ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోకపోతే ఎప్పటికి మోసపోతూనే ఉండాల్సి వస్తుందన్నారు. ఏ నిర్ణయం తీసుకుంటే ప్రజలకు మంచి జరుగుతుందో ఆలోచించుకోవాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.